క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి తన స్వగృహంలో ఏపీ ఎన్జీఓ క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు ఎస్.ప్రకాష్, సెక్రటరీ బి.రామకృష్ణ, ట్రెజరర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలనలో సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఇతర అధికారులు

పాలకొండ: పట్టణంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఇళ్ల నిర్మాణాలు చేసి, ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగానే సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కలిసి మండలంలోని అట్టలి గ్రామ సమీపంలోని 5 ఎకరాల స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఎంఐజీ గృహ సముదాయం నిర్మాణానికి ఈ స్థలం అనుకూలంగా ఉన్నట్లు వారు గుర్తించగా, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

భామిని: మండలంలోని బత్తిలికి చెందిన రిటైర్డ్ టీచర్ మీసాల పద్మనాభం ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం బత్తిలి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.నవ్య ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. దిశ చట్టం, మహిళలకు సంబంధించిన ఇతర చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వ్యవసాయాధికారులపై రైతుల ఆగ్రహం

వీరఘట్టం: ధాన్యం కొనుగోళ్లలో వ్యవసాయాధికారులు ప్రదర్శిస్తున్న తీరుపై మండలంలోని చలివేంద్రి గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌బీకే సెంటర్ వద్ద ఏఓ మన్మథరావును నిలదీశారు. లారీల్లో ధాన్యం బస్తాలు లోడు చేసి, మూడు రోజులు కావస్తున్నా ట్రక్ షీట్లు జనరేట్ చేయకపోవడంపై ప్రశ్నించారు. ప్రభుత్వం పారదర్శకంగా, రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతుంటే అధికారులు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సక్రమంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులను కోరారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

గరుగుబిల్లి: మండల కేంద్రంలో దివ్యాంగులైన రావుపల్లికి చెందిన సిద్దు, ఎస్ఆర్ పేటకు చెందిన ఎ.చంద్రమౌళికి వీల్‌చైర్లు, రావుపల్లికి చెందిన హరికృష్ణ, శివ, పొత్తూరు గ్రామానికి చెందిన వి.హరీష్‌కు హియరింగ్ మెషిన్లను శుక్రవారం అందజేశారు. అనంతరం ఎంఈఓ ఎన్.నాగభూషణరావు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

సాలూరు: విద్యార్థినులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని బాగువలస పీహెచ్‌సీ వైద్యుడు డా.రవికుమార్ అన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు వెలుగు ఏపీఎం సింహాచలం ఆధ్వర్యంలో మండలంలోని బాగువలసలో గ్రామ సంఘాలు,వి ద్యార్థినులతో వేర్వేరుగా శుక్రవారం సమావేశాలను నిర్వహించారు. స్థానిక హైస్కూల్‌లో కిశోర బాలికలకు ఆహార పోషణ, రక్తహీనత అంశాలపై అవగాహన పెంపొందించారు. పౌష్టికాహారాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని తెలిపారు.

ప్రతి ఇంటా ‘సంక్షేమ’ కాంతులు

● కొత్త పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



వృద్ధురాలికి కొత్తగా పెంచిన పెన్షన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పెన్షన్ల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె లబ్ధిదారులకు కొత్త పెన్షన్ నగదును అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న కొన్ని రోజులకే పథకం లబ్ధిదారుని ఇంటి వద్దకు వచ్చి చేరుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఆయన పాలన దేశానికే ఆదర్శమని, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చేలా ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. ఒకప్పుడు టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యుల కుటుంబ సభ్యులు, బంధువులకే పథకాలు ఇచ్చేవారని, ఇప్పుడు కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. కోవిడ్, తుపానులు వంటి విపత్తులు వచ్చినా ఏనాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పథకాల పంపిణీ ఆపలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం అమలులోని సంక్షేమ పథకాలతో ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ఇచ్చిన హామీలతో పాటు సభలు, సమావేశాలు, చర్చల్లో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీ వేకువజామునే పెన్షన్లు అందిస్తున్నామన్నారు. కురుపాం నియోజకవర్గంలోని 5 మండలాల్లో 39,500 మంది పెన్షన్ లబ్ధిదారులకు దాదాపు రూ.10.07 కోట్లను ప్రతినెలా ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని, మెరుగైన జీవనం సాగించాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, జెడ్పీటీసీలు గొర్లి సుజాత, మండంగి రాధిక, మరిశర్ల బాపూజీ నాయుడు, ద్వారపురెడ్డి లక్ష్మి, మూడడ్ల శశికళ, ఎంపీపీలు ఉరిటి రామారావు, దీనమయ, శెట్టి శ్యామల, ఎంపీటీసీలు, ఎంపీడీఓలు వి.శివరామప్ప, జగదీశ్‌కుమార్, ఎస్.రమేష్, జి.పైడితల్లి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు కిశోర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు

ఆవుల పెంపకం, పౌల్ట్రీల నిర్వహణకు రుణాలు

● పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు



లంపీ స్కిన్ వ్యాక్సిన్లు పరిశీలిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: ఆవుల పెంపకం, పౌల్ట్రీల నిర్వహణకు సబ్సిడీపై రుణాలు అందిస్తామని పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి పశుసంవర్ధక సహాయకుల పనితీరుపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ(ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) ద్వారా ఆవుల పెంపకం, పౌల్ట్రీల నిర్వహణకు గ్రామీణ ప్రాంతానికి చెందిన వారికి 35 శాతం రాయితీపై, మైదాన ప్రాంతానికి చెందిన వారికి 25 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రుణాలు మంజూరు చేస్తామన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. అలాగే 1.55 లక్షల పశువులకు లంపీ స్కిన్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్లు వేయడం జరిగిందని, మరో 30 వేల మూగజీవాలకు ఈ వ్యాక్సిన్ వేయనున్నామని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో 466 మెట్రిక్ టన్నుల టీఎంఆర్ పశు దాణాను 60 శాతం సబ్సిడీపై, 40 శాతం సబ్సిడీపై 10 గడ్డి కత్తిరించే యంత్రాలను రైతులకు అందించడం జరిగిందన్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు ఉన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లను వేగవంతం చేయండి

● జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్



జీసీసీ గ్యాస్ గొడౌన్‌ను పరిశీలిస్తున్న డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లను వేగవంతం చేయాలని జీసీసీ డీఎం(డివిజనల్ మేనేజర్) వి.మహేంద్రకుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, గ్యాస్ గొడౌన్‌ను పరిశీలించిన ఆయన మన్యంలో లభిస్తున్న కరక్కాయలు, నల్లజీడి, ఎండు ఉసిరి, నరమామిడి చెక్కలు, తానికాయలు, ముషిడిక, ఇండుగ పిక్కలు వంటి వాటిని కొనుగోలు చేయాలని తెలిపారు. కిలో ఉసిరిక పప్పును రూ.60 నుంచి రూ.80, కిలో నల్లజీడి పిక్కలు రూ.12 నుంచి రూ.15కు ధర పెంచడం జరిగిందని, పెంచిన ధరను అమలుచేస్తూ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. అనంతరం జీసీసీ పెట్రోలు బంకును సందర్శించి, అక్కడి రికార్డులు, పెట్రోలు, డీజిలు నిల్వ, నాణ్యతను పరిశీలించారు. అలాగే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వార్డెన్లతో సమావేశమైన ఆయన నిత్యావసరాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి, బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించారు. సమావేశంలో ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్, బ్రాంచి మేనేజర్ కృష్ణప్రసాదరావు, సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం

● మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: ఇంజినీరింగ్ శాఖ ద్వారా జరుగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. గుజ్జి నుంచి కుసుమూరుకు నిర్మిస్తున్న రోడ్డు చాలా అధ్వానంగా ఉందని, కనీసం రోలింగ్, వాటరింగ్ కూడా చేయడం లేదని దోనుబాయి ఎంపీటీసీ గేదెల కోటేశ్వరరావు ఆరోపించారు. దీనిపై స్పందించిన గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ మురళి రెండు రోజుల్లో తానే స్వయంగా రోడ్డు పనులు పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటానన్నారు. చావిడివలస జీపీఎస్ పాఠశాల, చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు–నేడు పనులు కూడా సక్రమంగా లేవని, ఖర్చు అయిన నిధులకు తగ్గట్టు అక్కడ పనులు జరిగినట్లు కనిపించడం లేదని ఎంపీపీ ఆదినారాయణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మంజూరైన నిధుల మేరకు పనులు చేపట్టామని, ఇంకా నిధులు వస్తే మిగతా పనులు పూర్తి చేస్తామని ఏఈ శ్రీవిద్య సమాధానమిచ్చారు. వరద గోడలు నిర్మించినప్పటికీ బిల్లులు రాలేదని, అలాగే గ్రామ సచివాలయ నిర్మాణాల పనులదీ అదే పరిస్థితి అని సర్పంచ్‌లు బాపయ్య, సుందరమ్మ తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేక తీర్మానం చేసి, ప్రభుత్వానికి నివేదిద్దామని ఎమ్మెల్యే తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 9 పంచాయతీలకు తొలి దశలో మంజూరైన నిధులతో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పనులు చేయాలంటే జీఎస్టీ చెల్లించాలంటున్నారని, దీంతో ముందుకు ఎవ్వరూ రావడం లేదని సభ్యులు తెలిపారు. కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేయించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎగువ దరబ పాఠశాల ఉపాధ్యాయుడు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని సర్పంచ్ సిమ్మయ్య తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని దోనుబాయి సర్పంచ్ వెంకునాయుడు కోరారు. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఎక్స్–రేతో పాటు ఇతర ల్యాబ్ పరీక్షలు చేయనున్నట్లు సూపరెండెండెంట్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. గత నెల అత్యధికంగా 107 ప్రసవాలు చేశామన్నారు. సీతంపేటలో మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాల రికవరీ సక్రమంగా లేదని, దీంతో కొత్త రుణాలు పొందలేని పరిస్థితి ఉందని వైస్ ఎంపీపీ కె.సరస్వతి తెలిపారు. రుణాల రికవరీ చేపట్టాలని లేదంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే సంబంధిత సిబ్బందికి తెలిపారు. ఎస్‌హెచ్‌జీలకు సరఫరా చేస్తున్న కోడిపిల్లల గురించి, ప్రజాప్రతినిధులకు తెలియజేయడం లేదని ఎంపీటీసీ హరి అన్నారు. అనంతరం హౌసింగ్, హార్టికల్చర్, పీఆర్ శాఖలపై చర్చ నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, వైస్ ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, సరస్వతి, జెడ్పీటీసీ సభ్యులు ఎస్.లక్ష్మి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మోహన్‌రావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న రవి

భామిని: మండలంలోని ఘనసర గ్రామంలో ఉన్న మదన కామేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి బెంగుళూరుకు చెందిన చిన్ని శేఖర్, లావణ్య దంపతులు రూ.లక్షను విరాళంగా అందజేశారు. నులకజోడుకు చెందిన శేఖర్ బెంగుళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా స్థిరపడగా, ఆయన సోదరుడు చిన్ని రవి చేతుల మీదుగా ఆలయ కమిటీకి శుక్రవారం రూ.లక్ష చెక్కు అందజేశారు. అనంతరం చిన్ని రవిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎం.మోహనరావు, వైఎస్సార్ సీపీ కార్యదర్శి కిల్లారి పాల్గుణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.చిరంజీవులు, బి.ఆనందరావు, కె.కాంతారావు, బి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ ప్రారంభం



కొత్తగా ప్రారంభించిన హెల్త్ సబ్‌సెంటర్‌లో సేవలందిస్తున్న సిబ్బంది

భామిని: మండలంలోని పసుకుడిలో హెల్త్ సబ్ సెంటర్‌ను సర్పంచ్ బెవరా భార్గవనాయుడు శుక్రవారం ప్రారంభించారు. అందుబాటులోకి వచ్చిన హెల్త్ సబ్‌సెంటర్ ద్వారా నిత్యం వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో భాగంగా పలువురు రోగులను వైద్య సిబ్బంది పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బత్తిలి పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ లోపింటి శ్రావణి, ఏఎన్ఎం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

● ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఉరిడి గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా అర్హులై ఉండి ఎవరికైనా పథకాలున్నా వెంటనే తెలియజేయాలన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఇదే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో కురుపాం జెడ్పీటీసీ సుజాత, జెడ్పీ వైస్ చైర్మన్ ఎం.బాపూజీనాయుడు, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, సర్పంచ్ లక్కాయి పాల్గొన్నారు.

సీఆర్‌టీ నియామకాలు రద్దు చేయాలి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో 2017లో నియమించిన 138 మంది సీఆర్‌టీ నియామకాలను వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు ఓ ప్రకటనలో శుక్రవారం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఐటీడీఏ పీఓ నవ్యకు కూడా వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. సీఆర్‌టీ నియామకాల్లో గిరిజన యువతకు అన్యాయం జరిగిందని, టెట్ అర్హత లేని గిరిజనేతరులకు ఆయా పోస్టులు కట్టబెట్టారని ఆరోపించారు.

నేడు వీరఘట్టంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలోని సచివాలయం–1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు ఈఓ వి.రామచంద్రరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కార్యక్రమంలో పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస: గిరిజనులకు వారు ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న బంజరు, కొండపోడు భూముల పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు కూరంగి సీతారాం కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక తహసీల్దారు సీతారామయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చవద్దని, జీవో నంబరు–3కు చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే టీకేజమ్ము నుంచి నడిమిసిరిపి, పల్లపుసిరిపికి, చినదోడిజ నుంచి ద్రాక్షణికి, గొర్లె నుంచి కూటాంకు, చినతోలుమండ గూడ నుంచి చినతోలుమండకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.

పీహెచ్‌సీలతో మెరుగైన వైద్యసేవలు



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పాలకొండ రూరల్: పీహెచ్‌సీల ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ బొమ్మాళి భాను సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నవరం పీహెచ్‌సీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ నిధుల ఖర్చు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. సర్పంచ్ గవర రాజశేఖర్ మాట్లాడుతూ పీహెచ్‌సీల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రిలో చేపడుతున్న అభివృద్ధి పనులను గుర్తించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే అభివృద్ధి కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు వి.కమల్‌నాథ్, కె. చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు బి.సుధాకర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కొత్త కార్యవర్గం ఏర్పాటు

గరుగుబిల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల కొత్త కార్యవర్గం ఏర్పాటు శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా సీహెచ్ వెంకట కూర్మినాయుడు, ఉపాధ్యక్షుడిగా టి.భాస్కరరావు, కార్యదర్శిగా ఎ.రమేష్, కోశాధికారిగా ఎ.లలిత ఎన్నికయ్యారు.

పెన్షన్ల పంపిణీ



వీరఘట్టం: వండవలో పెన్షన్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామంలో కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రభుత్వం పెంచిన రూ.2,750 పెన్షన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు. అలాగే మండలంలోని కత్తులకవిటి గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి లబ్ధిదారులకు అందజేశారు.

పాలకొండ: పట్టణంలోని 17వ వార్డులో కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు ఆధ్వర్యంలో కొత్త పెన్షన్ల పంపిణీ శుక్రవారం జరిగింది. మండలంలోని కొండాపురం గ్రామంలో కొత్తగా 13 మందికి మంజూరైన పెన్షన్లను జిల్లా వ్యవసాయ మండలి సభ్యులు శాసుబిల్లి జనార్ధనరావు, సర్పంచ్ రాయి వనజ అందించారు. సింగన్నవలస, తంపటాపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొత్త పెన్షన్ల పంపిణీ చేపట్టారు.

భామిని: మండలంలోని పోలీస్‌కోట పంచాయతీ కార్యాయంలో సర్పంచ్ బిడ్డిక నారాయణ ఆధ్వర్యంలో కొత్త పెన్షన్ల పంపిణీ చేపట్టారు.



పాలకొండ: 17వ వార్డులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పాపినాయుడు

బెంతు ఒరియా, బోయ వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దు

భామిని: బెంతు ఒరియా, బోయ వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దని గిరిజన జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వివిధ గిరిజన సంఘాలు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నీలాపు అప్పారావుకు వినతిపత్రం అందించి, గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కె.అప్పారావు, పి.శ్రీనివాసరావు, కె.సుగ్రీవులు, కె.చంటి, బి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం నాయకులు కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దారు పి.సోమేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చవద్దని, నాన్ షెడ్యూల్డు గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని, జీవో నంబర్–3కు చట్టబద్ధత కల్పించాలని, గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని, జీడి పంటకు నష్టపరిహారం చెల్లించాలని, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్. రామరాజు, ఎ.బరియా, ఎస్.ఆదియ్య, ఎస్.జోషి తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: బోయ వాల్మీకీలను ఎస్టీల్లో చేర్చొద్దని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం నాయకులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. సంఘ నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, బి.శంకరరావు, పి.తిరుపతిరావు మాట్లాడుతూ బోయ వాల్మీకీలను ఎస్టీల్లో చేర్చాలని తీసుకువచ్చిన జీవో నంబర్–52ను తక్షణమే రద్దు చేయాలని, జీవో నంబర్–3కు చట్టబద్ధత కల్పించాలని కోరారు. నాన్ షెడ్యూల్డు గ్రామాలను ఏజెన్సీలో చేర్చాలని, జీడి మామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారందరికీ 14 రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



భామిని: ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజనులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు